# ఆహ్లాదపురం ఆరోవీధి

కొల్లూరి సోమశంకర్

రాజధానిలోని ఓ ప్రముఖ ఇంజనీరింగ్ సంస్థ నగర శివార్లలో దాదాపు అన్ని వసతులతో 'ఆహ్లాదపురం' అనే కాలనీని నిర్మించింది. ఈ కాలనీలోని ఆరోవీధిలో ఐదు ఇళ్ళు ఉన్నాయి.

ముకుందరావు, జానకమ్మగార్లదో కుటుంబం. ఇద్దరూ అరవై ఏళ్ళు పైబడినవారే! రావుగారు సెక్రటేరియట్‌లో పనిచేసి రిటైరయ్యారు. ఉన్న ఇద్దరు పిల్లలు ప్రయోజకులై విదేశాల్లో స్థిరపడ్డారు. ఇంట్లో ఉండేది వృద్ధ దంపతులు మాత్రమే. బాధ్యతలు లేకపోవడం, ఆర్థికంగా లోటేమీ లేకపోవడంతో వారు ప్రశాంతంగా ఉంటారు. ఇతరులకి సహాయపడడంలో రావుగారెప్పుడూ ముందుంటారు.

తర్వాతి ఇల్లు మురళి, సరళది. వాళ్ళు ఆ ఇంట్లో అద్దెకు వుంటున్నారు. మురళిది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం కాగా, సరళ ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తోంది. తాను మహా బిజీ అనీ, అస్సలు తీరిక ఉండదని అంటుంటాడు మురళి ఎప్పుడూ.

వీరికి ఎదురిల్లు పద్మనాభంగారిది. ఆయన కలెక్టర్ ఆఫీసులో పని చేస్తారు. ఆ ఇంట్లో వాళ్ళమ్మగారు రుక్మిణమ్మ, భార్య వనజ, డిగ్రీ చదువుతూ ఉన్న పుత్రుడు ఆనంద్, ఇతర సభ్యులు. సులభ వాయిదాలపై వస్తువులను కొనే అలవాటు కారణంగా వనజ, 'వాయిదాల వనజ'గా కాలనీ అంతా సుపరిచితం.

పద్మనాభంగారి పక్కింట్లో గిరిజ, రమణ ఉంటారు. ఆ ఇంటిని గిరిజ వాళ్ళ నాన్న కట్టించి గిరిజకు కానుకగా ఇచ్చారు. రమణకి సిటీలో ఆటో గారేజీ ఉంది. గిరిజ కలవారి పిల్ల కావడంవల్ల రమణ కాస్త నెమ్మదస్తుడు కావటంవల్ల ఆ ఇంట్లో తరచూ గిరిజ మాటే నెగ్గుతుంటుంది. చేతినిండా డబ్బుండడంతో, ఆమె ఇంటినంతా ఖరీదైన వస్తువులతో నింపేస్తూ వుంటుంది.

ఈ నాలుగు ఇళ్ళకి కాస్త దూరంగా వున్న ఇల్లు కాంట్రాక్టర్ ఓబులయ్యది. ప్రస్తుతం ఖాళీగా వున్న ఆ ఇంట్లో రేపు అద్దెకు దిగుతున్నారట.

• • •

మర్నాడు పొద్దున్న...

''ఏవండీ! నాకు ఆఫీసుకు టైమయిపోతోంది. బస్టాండ్ వరకూ స్కూటర్‌పైన దింపరూ?'' అడిగింది సరళ. అప్పుడు సమయం 8.45. ఆమె ఎక్కాల్సిన బస్ 8.55కి వెళ్లిపోతుంది. తాపీగా సిగరెట్ తాగుతూ పేపర్ చదువుతున్న మురళి ఆమె మాటల్ని పట్టించుకోలేదు. అతడు ఆఫీసుకు రోజూ 10.15కి బయలుదేరుతాడు. చెప్పులు వేసుకుంటూ మరోసారి అడిగింది సరళ.

''నేనేం ఖాళీగా లేను'' విసురుగా జవాబిచ్చాడు మురళి.

అతడివైపు తిరస్కారంగా ఓ చూపు పడేసి గబగబా బయటకు నడిచింది సరళ. భార్యని చెప్పుచేతల్లో ఉంచాలనే పాత భావాలున్న మనిషి మురళి. తన భావాలు కాలం చెల్లినవని తెలిసినా అతడిలోని పురుషాధిక్యత ఆ నిజాన్ని ఒప్పుకోలేదు. భార్య ఆఫీసుకి వెళ్లిన ఓ గంటకి బద్ధకంగా లేచి తయారై తనూ ఆఫీసుకు వెళ్లాడు మురళి.

కొంతసేపటికి ఓబులయ్య ఇంటిముందు సామానుతో వున్న ఓ లారీ వచ్చి ఆగింది. దాని వెనుకే వచ్చిన ఆటోలోంచి ఓ యువజంట దిగారు. సామానులు అన్నీ లోపల పెట్టించేసరికి మధ్యాహ్నం అయింది. భోజనం చేసి వచ్చారేమో బయటకెక్కడికీ వెళ్లకుండా ఇల్లు సర్దుకోసాగారు కొత్తగా వచ్చినవాళ్ళు. అదే సమయంలో ఓ ట్రాలీ వచ్చి గిరిజ ఇంటిముందు ఆగింది. దాంట్లోంచి ఓ లేటెస్ట్ మోడల్ ఫ్రిజ్‌ను దింపి ఇంట్లోకి తీసుకువెళ్లారు.

సాయంత్రమయ్యాక కొత్తగా వచ్చిన జంట కార్తీక్, భవ్య వీధిలోని అందరి ఇళ్లకి వెళ్లి తమని పరిచయం చేసుకున్నారు. కార్తీక్ ఓ ప్రముఖ దినపత్రికలో పని చేస్తాడు. భవ్య ఎం.ఎ ఇంగ్లీషు చదివింది.

అదేరోజు ఫ్రిజ్ కొన్న సందర్భంగా తమ ఇంట్లో ఓ చిన్న టీ పార్టీ ఏర్పాటుచేసి వీధిలోని వారినందరినీ ఆహ్వానించింది గిరిజ. ఓ గంటపాటు అంతా సరదాగా గడిపాక ఎవరింటికి వారు బయల్దేరారు.

''ఫ్రిజ్ కొన్నందుకే పార్టీ ఇవ్వాలా మరీ బడాయి కాకపోతే?'' దారిలో భవ్యతో అంది వనజ. భవ్య ఏమీ మాట్లాడకపోయేసరికి మళ్లీ తనే అంది ''అయినా మేమూ కొంటాంలే ఫ్రిజ్. డైనింగ్ టేబుల్‌కి కట్టాల్సిన వాయిదాలు అయిపోవచ్చాయి. ఆ తరువాత వెంటనే ఫ్రిజ్ కొని పారేస్తాను.''

భవ్య చిరునవ్వు నవ్వి ఊరుకుంది.

• • •

ఆదివారం సాయంత్రం తమ వీధిలోని మిగిలిన నాలుగిళ్ళ వాళ్ళని టీకి పిలిచారు కార్తీక్, భవ్య. వారిద్దరూ ఎంతో సింపుల్‌గా ఉన్నారు. ఇంట్లో పెద్దగా సామానులేమీలేవు. కానీ ఇల్లంతా పొందిగ్గా సర్ది వుంది. గదులు, కిటికీలు, కర్టెన్లు పరిశుభ్రంగా వున్నాయి. గోడలమీద ఓవైపు స్వామి వివేకానంద చెప్పిన 'ఆల్ పవర్ ఈజ్ విదిన్ యు' పద్యాల పోస్టర్ లామినేట్ చేయబడి వుంది. మరోవైపు ఉన్నితో అల్లిన బొమ్మలు, చిన్న చిన్న పెయింటింగ్స్ ఉన్నాయి. ఆ పెయింటింగ్స్‌ని భవ్య స్వయంగా వేసింది. అల్లికలు కూడా ఆమె పనే. హాలులో ఓ వారగా వున్న అల్మారాలో పుస్తకాలు పొందిగ్గా ఉన్నాయి. ఇల్లంతా చూసాక అందరూ టీ తీసుకున్నారు.

''ఏమ్మా! నువ్వు సోఫా సెట్, ఎయిర్‌కూలర్ వంటివి వాయిదాలలో తీసుకుంటావా?'' అని అడుగుతూ 'నాకు తెలిసిన షాపు వుంది. ఏర్పాటు చేస్తాను'' అంది వనజ.

''వద్దండీ! ప్రస్తుతానికి మాకు కావాల్సిన అన్ని సామాన్లు వున్నాయి. అవసరమైనప్పుడు మిగిలినవాటి సంగతి చూడవచ్చు'' జవాబిచ్చింది భవ్య. ఆమె మాటల్ని సమర్థించాడు కార్తీక్.

''నాకైతే మీ ఇల్లు బోసిగా, బీదగా వున్నట్టుంది'' వ్యాఖ్యానించింది గిరిజ.

ఓ క్షణంపాటు నివ్వెరపోయినా ఏమీ సమాధానం చెప్పకుండా ఊరుకున్నారు భవ్య కార్తీక్‌లిద్దరూ.

''ఇల్లు అంతటినీ ఖరీదైన వస్తువులతో నింపేస్తే గొప్పవారనిపించుకోరు. జీవితంలో ప్రేమాభిమానాలు, ఆప్యాయతలు లేకపోతే ఎంత డబ్బుండి ఏం లాభం?'' అన్నాడు రమణ.

''మీరు కాసేపు మాట్లాడకుండా ఉంటే మంచిది'' అని అర్థం వచ్చేలా సైగచేసి అతడిని కొరకొరా చూస్తూ గోడపైనున్న పెయింటింగ్‌వైపు కదిలింది గిరిజ. పక్కనే వున్న రుక్మిణమ్మ, వనజలు కనుసైగలు చేసుకున్నారు.

ఇల్లంతా కలియతిరిగిన జానకమ్మగారు ''బావుందమ్మా! చాలా బాగా సర్దుకున్నావు'' అన్నారు భవ్యతో. కొద్దిసేపటి తరువాత వచ్చిన అతిథులంతా సెలవు తీసుకున్నారు.

• • •

తమ ఇంట్లో హాల్లో కూర్చుని గిరిజ గురించి మాట్లా

డుకుంటున్నారు రుక్మిణమ్మ, వనజ.

''చూసారా! దాని పొగరు? మొగుడంటే ఏమాత్రం గౌరవంలేదు. డబ్బుందనే కదా ఆ అహంకారం?'' అంది రుక్మిణమ్మ.

''ఆవిడగారు ఏ రోజున మొగుడి మాటలు లెక్కచేసిందిలెండి. అయినా డబ్బున్నవాళ్ళు ఏం చేసినా చెల్లుతుంది కదండీ!'' అంది వనజ.

అక్కడే కూర్చుని పేపరు చదువుతున్న పద్మనాభం ''అబ్బాబ్బా... ఇంకొకరి ఇంటిగోల మనకెందుకు? ముందు మనింటి సమస్యల గురించి ఆలోచించండి. కనబడ్డ ప్రతిదాన్నీ వాయిదాల్లో కొనేస్తూ నువ్వు, చదువు గురించి ఏమాత్రం పట్టించుకోకుండా నీ కొడుకు వల్లుగురిలో నా పరువు తీస్తున్నారు. ముందు మన కుటుంబాన్ని చక్కదిద్దుకుని అప్పుడు ఇంకొకరిపై వేలు చూపించు'' అన్నాడు భార్యతో.

''ఇంటి యజమానిగా సామాన్లు కొనడం, పిల్లలకు చదువు చెప్పించడం మీ బాధ్యత. అయినా ఒక్కసారిగా డబ్బిచ్చి కొనలేనివారు వాయిదాలలో కొంటే చిందులు తొక్కుతారేం? వాడిని మెడిసిన్ చదివించమని నేనంటే, బికామ్‌లో చేర్పించింది మీరు కాదూ? ఇష్టంలేని చదువు వాడు మాత్రం ఎలా చదువుతాడు?'' అంటూ విరుచుకుపడింది వనజ.

''అవునవును. పాపం వాడు ఎంసెట్‌లో స్టేట్ ఫస్ట్ వచ్చాడుకదా? ఇంటర్ మూడేళ్ళకిగానీ పాస్ అవని వాడు డాక్టర్ ఎలా అవుతాడే? అసలు వాడికి చదువుమీద శ్రద్ధ ఉండి ఏడిస్తేగా?'' అన్నారు పద్మనాభం.

''ఆపండి నాన్నా! మీరు అమ్మా వాదించుకున్నప్పుడల్లా నా చదువు గురించే ఎందుకు ప్రస్తావిస్తారు? నాకు చదువు వంటబట్టడంలేదు. నేను ఏదైనా లోన్ తీసుకుని షాప్ పెట్టుకుంటాను'' అన్నాడు ఆనంద్ తన గదిలోంచి బయటకి వస్తూ.

''అప్పటిగానీ తమరు శాంతించరన్నమాట. కలెక్టర్ ఆఫీసులో సీనియర్ క్లర్క్‌ని. నా కొడుకు బడ్డీ కొట్టు పెట్టుకుంటే నాకెంత నామోషీగా వుంటుందో నీకేం తెలుసు? అందరూ నన్ను నానా మాటలు అంటుంటే నీకు తృప్తిగా వుంటుంది. అయినా నా బాధ ఎవరికి పట్టింది? మీ ఏడుపు మీరేడవండి'' అంటూ చొక్కా వేసుకుని రోడ్డున పడ్డారు పద్మనాభం.

వీధంతా వీళ్ళ అరుపులు, కేకలు వినబడుతున్నాయి. అది ఆహ్లాదపురమా లేక అసహనపురమా?

• • •

మర్నాడు ఉదయం ఆనంద్, రావుగారిని కలసి తనకిక చదవాలని లేదని, ఏదైనా ఉపాధి చూపమని అడిగాడు. అలాగే చూద్దామంటూ హామీ ఇచ్చారు రావుగారు. సాయంత్రం కాలనీ పార్కులో రావుగారు, పద్మనాభం, మురళి, ఆనంద్, రమణ, కార్తీక్, భవ్య కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. మాటల్లో ఆనంద్ చదువు ప్రస్తావనకొచ్చింది.


''మురళీ! నువ్వు ఎంకామ్ పాసయ్యావుకదా! నీకు శనివారం, ఆదివారం సెలవేకదా. కాస్త మావాడికి అకౌంట్స్ నేర్పకూడదూ?'' అడిగారు పద్మనాభం.

''సారీ అండీ! నాకు అస్సలు తీరికలేదు. పైగా మీ అబ్బాయికి చదువుమీద ఇంట్రెస్టులేదు. అలాంటి వాడికి నేనేం చెప్పగలను? నావల్లకాదు'' అని తప్పించుకోజూసాడు మురళి.

''కాస్త ఆలోచించు మురళీ! మనమందరం కలసి ఆనంద్ విషయంలో ఏదో ఒకటి చేద్దాం'' అన్నాడు రమణ.

''భార్యని అదుపులో పెట్టుకోలేని వాడివి, నువ్వు కూడా నాకు సలహాలిస్తున్నావా? అసలు నువ్విక్కడికి రావడానికి మీ ఆవిడ పర్మిషన్ ఇచ్చిందా? అంతా ఆడపెత్తనం...'' అన్నాడు మురళి ఈసడింపుగా.

''కుటుంబంలో పెద్దతనం లేదా పెత్తనం ఎవరు చేస్తున్నారనేది ముఖ్యంకాదు. కుటుంబ శ్రేయుస్సు ముఖ్యం. అయినా మా స్వంత విషయాలలో తల దూర్చడం మాని ఆనంద్‌కి నువ్వేం చేయగలవో చెప్పు'' అన్నాడు రమణ కటువుగా.



## పెద్ద బ్యానర్స్‌కే నా కాల్షీట్స్



ఈమధ్య ఎయిర్‌పోర్టుల్లో ఎక్కువగా కనిపిస్తున్న తార- ఆర్తీ అగర్వాల్. 'నువ్వు నాకు నచ్చావ్' చిత్రంలో విక్టరీ వెంకటేష్ సరసన, 'నువ్వులేక నేను లేను' చిత్రంలో తన అందాల్ని, ఒంపుసొంపుల్నీ హైస్థాయిలో ప్రదర్శించింది.

అమెరికాలో ఇటీవల ప్లస్‌టూ పరీక్షలు (ఇంటర్మీడియట్) రాసొచ్చిన అమెరికా బ్యూటీకి చిరంజీవి, మహేష్‌బాబు, యన్టీఆర్ జూనియర్ చిత్రాల్లో నటిస్తూ తెలుగులో బిజీ హీరోయిన్‌గా వుంది. తమిళంలో కూడా ఓ చిత్రంలో నటిస్తోంది. తెలుగు, తమిళంలో నటించే చిత్రాలు మరికొన్ని కన్ఫర్మ్ కావలసి వుంది. మరికొన్ని చిత్రాల ఆఫర్స్ వున్నా, పెద్ద బ్యానర్, పెద్ద నిర్మాతలకే తన కాల్షీట్స్ ఇస్తానంటోంది. తన చెల్లెలు ఆదితి అగర్వాల్‌ను కూడా సినీరంగానికి పరిచయం చేయబోతుందట!

- మానస

దాంతో మురళి రుసరుసలాడుతూ లేచి ఏదో పనుందంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

వెంటనే పద్మనాభం ఆనంద్‌కేసి తిరిగి ''చూసావ దరిద్రుడా నీ ప్రతిష్ట? ఎలాగోలా డిగ్రీ పూర్తి చేస్తే ఏదో ఒక ఉద్యోగం దొరుకుతుందంటే నీ చెవి కెక్కడంలేదు. అనుభవించు'' అంటూ శాపనార్థాలు పెట్టారు.

ఇంతలో కార్తీక్ కలుగచేసుకుని ''ఊరుకోండి పద్మనాభంగారూ! బ్రతకడానికి డిగ్రీ ఒక్కటే చాలదు. అయినా లోకంలో ఉద్యోగులు మాత్రమే బ్రతుకుతున్నారా? చదువు రానివాళ్ళు, డిగ్రీ లేనివాళ్ళు తమని తాము పోషించుకోవడంలేదా? కేవలం ఏ ప్రభుత్వోద్యోగం మీదో, టేబుల్ వర్క్ పైనో ఆశలు పెంచుకోవడం తప్పు. నిజాయితీగా తమని తాము పోషించుకోవడం ముఖ్యం. ఇతరులని మోసం చేయనంతవరకూ ఏ పని చేసినా తప్పుకాదు. మీ అబ్బాయికి చదువుకోవడం ఇష్టం లేకపోతే అతడికి ఆసక్తి వున్న రంగంలో ప్రోత్సహించండి. అంతేగానీ మీ అభిప్రాయాలని అతడిపై రుద్దకండి'' అన్నాడు.

కార్తీక్ అభిప్రాయాన్ని సమర్థించారు రావుగారు. ఆనంద్‌కి టైప్ వచ్చు కాబట్టి తన స్నేహితుడి దగ్గర డిటిపి కోర్సు చేర్పిస్తానని రమణ చెప్పాడు. తనకి తీరిక వేళల్లో ఆనంద్‌కి స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్ నేర్పుతానని భవ్య చెప్పింది. ఈ ప్రతిపాదన అందరికీ నచ్చింది. ఓ సమస్యని తాత్కాలికంగానైనా పరిష్కరించగలినందుకు అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.


• • •

తలుపు తీసే ఉండడంతో ''భవ్యా... భవ్యా!'' అని పిలుస్తూ లోపలికి వచ్చింది సరళ.

''ఎవరూ?'' అంటూ గుమ్మంలోకి తొంగి చూసి- ''తను బయటకి వెళ్ళింది. వచ్చేస్తూ వుంటుంది. రండి కూర్చోండి'' అంటూ వంటింట్లోంచి సమాధానం చెప్పాడు కార్తీక్. అతడప్పుడు కూరలు తరుగుతున్నాడు. హాల్లోకి వచ్చి కూర్చుని టేబుల్‌పై వున్న పుస్తకం అందుకుని పేజీలు తిప్పసాగింది సరళ. కప్పులో కాఫీ తెచ్చి ఆమెకిచ్చాడు కార్తీక్.

''ఈ వంటింటి పనులను మీరు చేస్తున్నారేం?'' ఆసక్తిగా అడిగింది సరళ.

''వంటింటి పనులని, మధ్య గది పనులని విడగొట్టి కొన్నింటిని ఆడవాళ్ళే చేయాలనడం అర్థం లేనిది. ఇల్లు మనదైనప్పుడు పనులు కూడా మనవే అవుతాయని మా అభిప్రాయం. భవ్యకి తీరిక దొరికితే నా పనులలో సాయపడుతుంది. అలాగే నేను కూడా'' చెప్పాడు కార్తీక్.




''కార్తీక్ చెప్పింది నిజమే'' అంటూ లోపలికొచ్చింది భవ్య.

కార్తీక్ భార్యని ఏమే... ఒసే అని పిలవకపోవడాన్ని గమనించింది సరళ. ఇద్దరికీ ఒకరంటే మరొకరికి ప్రేమా, గౌరవం అని గ్రహించింది. వారిద్దరి అనురాగాన్ని చూసి ముచ్చటేసింది సరళకు.

భవ్యని, సరళని మాట్లాడుకోమంటూ తాను రాసుకోడం కోసం పక్కగదిలోకి వెళ్ళాడు కార్తీక్. తన ఉద్యోగం విషయంలో భవ్యని ఏదో సలహా అడగడం కోసం వచ్చింది సరళ. వాళ్ళ మాటల్లో మురళి ప్రస్తావన వచ్చింది.

''ఆయన స్వతహాగా మంచివారే. కాస్త నోటి దురుసు. నేనంటే తేలికభావం తప్ప ఇతర దురలవాట్లేమీలేవు. వైవాహిక బంధంలో స్త్రీపురుషులిద్దరూ సమాన భాగస్వాములేనన్న నిజాన్ని ఆయన గుర్తించడంలేదు. మీలాంటి వారిమధ్య ఉంటే కొద్దికొద్దిగానైనా ఆయనలో మార్పు వస్తుందని నా ఆశ'' అంది సరళ.

''ఒక వ్యక్తిలో చాలాకాలంగా బలపడ్డ అభిప్రాయాలను సులువుగా మార్చలేము. కొంత సమయం పడుతుంది. గడ్డకట్టిన నెయ్యి కరగాలంటే చిన్న సెగ అవసరం. తమ అభిప్రాయాలు తప్పని తెలుసుకున్నాక విజ్ఞులు వాటిని పట్టుకుని వేలాడరు. మురళిగారికి ఆపాటి వివేకం ఉందనే నాకు అనిపిస్తోంది'' అంది భవ్య.

అప్పుడే సరళ కోసం అక్కడికి వచ్చిన మురళి వారి సంభాషణ అంతా విన్నాడు. తాను మరీ పాతకాలపు భర్తలా ప్రవర్తిస్తున్నానేమోనని మొదటిసారిగా ఆ క్షణంలో అతనికి అనిపించింది. భార్యని పిలవకుండానే నిశ్శబ్దంగా వెనుదిరిగాడు. ఆత్మవిమర్శ మనిషిలో మొదలైతే ఆలస్యంగానైనా మంచి మార్పుకు దోహదం చేస్తుంది.

• • •

రుక్మిణమ్మగారికి ఒంట్లో నలతగా వుందంటే చూడడానికి వెళ్ళింది భవ్య. పరామర్శలయ్యాక వనజ, భవ్య వచ్చి హాల్లో కూర్చున్నారు. మాటల మధ్యలో గిరిజ రెండు మూడురోజుల్లో ఓ బంగారు గొలుసు కొంటోందని తెలిసిందని వనజ, భవ్యతో చెప్పింది.

''మా ఆయనకి వచ్చేనెలలో బోనస్ వస్తుంది. ఆ డబ్బు చేతిలో పడగానే నేను కూడా ఓ బంగారు గొలుసు చేయించుకుంటాను'' ప్రకటించింది వనజ. భవ్యని పరీక్షగా చూస్తూ ''అవునూ... నీ ఒంటిపైన కూడా పెద్దగా బంగారం ఏమీ వున్నట్టులేదే? మీ ఆయనేమీ కొనడా?'' ఆరాతీసింది వనజ.

''అదేం కాదండీ. నాకే ఇష్టంలేదు. మేము ఫాల్స్ ప్రిస్టేజికి దూరం. అయినా ఎదుటివారు గొప్పగా బ్రతుకుతున్నారని అసూయ పడుతూ కూర్చుంటే మనం అందంగా జీవితాన్ని గడిపే అవకాశాన్ని కోల్పోతాం'' చెప్పింది భవ్య. ఇంతలో-

''వనజా! సీరియల్ టైం అవుతోంది. టీవీ పెట్టు'' అంటూ రుక్మిణమ్మగారు హాల్లోకి రావడంతో ఏదో అన

బోయిన వనజ మాట్లాడలేదు.

''నేను వెళ్ళొస్తానండీ'' చెప్పింది భవ్య.

''కూర్చో! సీరియల్ చూసి వెడుదువుగానీ'' అంది వనజ.

''నాకు ఇంట్రెస్టు లేదండీ. మేము టీవీ చాలా తక్కువగా చూస్తాము. వార్తలు, నేషనల్ జియోగ్రాఫిక్, డిస్కవరీ చానెళ్లుతప్ప సీరియల్స్ చూడం'' అంది భవ్య.

''అదేం? ఇప్పుడొస్తున్న సీరియల్స్ బాగానే వుంటున్నాయి. మరి మీకెందుకు నచ్చడంలేదో?'' అడిగింది వనజ.

''అంతంలేని ఎపిసోడ్లతో నిత్య జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను భూతద్దంలో చూపిస్తూ ఆయా సీరియళ్లలోని పాత్రలవి కూడా మనలాంటి కష్టాలే అని నమ్మిస్తాయి చాలా ఛానెళ్ళు. సాటి మనుషుల కంటే ఎక్కువగా ఈ కల్పిత పాత్రలు మన సానుభూతిని పొందుతున్నాయి. సీరియళ్లను సాగదీసి నిర్మాతలు లాభాలు పొందుతుంటే మనం మాత్రం ఎంతో విలువైన సమయాన్ని కోల్పోతున్నాం'' విశ్లేషించింది భవ్య.

భవ్య మాటల్లోని వాస్తవాన్ని గ్రహించిన వనజ ఏమీ మాట్లాడలేదు.

''ఏమోనమ్మా! ఇవన్నీ మాకు అర్థం కాని విషయాలు. ఏదో కాస్త వినోదం కోసం టీవీ చూస్తాం అంతే'' అంది రుక్మిణమ్మ.

మారు మాట్లాడకుండా వెళ్లొస్తానని చెప్పి అక్కడి నుంచి కదిలింది భవ్య.

● ● ●

కార్తీక్, భవ్య ఆ కాలనీకి వచ్చి రెండునెలలు దాటింది. ఆ వీధిలోని అందరికీ వీరిద్దరూ బాగా నచ్చారు. కొన్ని విషయాలలో కార్తీక్, భవ్యల సలహాలు పొందిన ఆనంద్, సరళలాంటి వారికి మేలు జరిగింది. సాయంత్రాలు రావుగారు, కార్తీక్ చదరంగం ఆడడం ప్రారంభించాక వారిమధ్య చనువు పెరిగింది.

ఓరోజు రాత్రి కార్తీక్‌ను, భవ్యను తమ ఇంట్లో భోజనానికి ఆహ్వానించారు రావుగారు. కార్తీక్, రావుగారు చదరంగం ఆడుతుంటే జానకమ్మగారు, భవ్య కలిసి వంట పూర్తిచేసారు. భోజనాలయ్యాక నలుగురూ వసారాలో కూర్చుని కబుర్లు చెప్పుకోసాగారు. వాళ్ల మాటల్లో తమ వీధిలోని వారి ప్రస్తావన వచ్చింది.

''ఆనంద్ డిటిపి కోర్సు పూర్తి చేసాడు. నాకు తెలిసిన ఆఫీసులో డిటిపి తెలిసినవారికోసం వెతుకుతున్నారు. ఆనంద్‌ను ఆ ఉద్యోగంకోసం పంపాను. అక్కడ కాస్త అనుభవం సంపాదిస్తే ఏదైనా బ్యాంకు ద్వారా లోను తీసుకుని స్వంతంగా ఇన్‌స్టిట్యూట్ పెట్టవచ్చని ఆనంద్‌కి చెప్పాను. అతడిప్పుడు ఎంతో సంతోషంగా ఉన్నాడు'' చెప్పారు రావుగారు.

''మొత్తానికి ప్రయోజకుడు అయ్యాడు. అదేకదా అందరూ కోరుకునేది'' అన్నాడు కార్తీక్.

''అవును భవ్యా! చాలా రోజులనుంచి చూస్తున్నాను. మీ వాళ్లెవరూ మీ ఇంటికి వస్తున్నట్టు లేరే?'' ప్రశ్నించారు జానకమ్మగారు.

''మాది లవ్ మ్యారేజ్ ఆంటీ. రెండువైపులవాళ్ళకి పెళ్లి ఇష్టంలేదు. అందుకని అందరూ మాకు దూరంగా ఉంటున్నారు'' చెప్పింది భవ్య.

''పోనీలేమ్మా మీకు అండగా మేమున్నాము. దిగులుపడకు'' అన్నారు జానకమ్మగారు ఓదార్పుగా.

''నిజమే ఆంటీ! మేము మీ అందరి దగ్గరా ఎంతో ఆదరాభిమానాలు పొందాము. సొంత వాళ్లలో పోగొట్టుకున్నది ఇతరులలో పొందినప్పుడు ఇక స్వపరభేదాలేముంటాయి. మీరు మావాళ్ళే'' అన్నాడు కార్తీక్.

అతని మాటలకి అవునన్నట్లుగా తలూపుతూ–

''ఏమైనా మీరు వచ్చాక మన వీధి పరిస్థితి చాలా మారింది. మన కాలనీ పేరు సార్ధకమైంది'' అన్నారు రావుగారు.

''అందంగా, ఆనందంగా జీవించడం ఓ కళ. చాలామంది చికాకులు, అసహనంతోనే జీవితాలను గడిపేస్తున్నారు. అందంగా, సుఖంగా జీవించే కొద్దిమందిని చూసైనా మిగిలినవారు నేర్చుకోవడంలేదు. అలాగే దురదృష్టవశాత్తూ మన విద్యావిధానంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఏ స్థాయిలోనూ బోధింపబడడంలేదు'' అంటూ బాధపడింది భవ్య.


''మునుపు కనీసం పాఠశాల స్థాయిలో 'సొంత లాభంకొంత మానుకుని', 'ఎప్పటికెయ్యది' వంటి పద్యాలు లౌకికంగా, లౌక్యంగా ఎలా బ్రతకాలో తెలిపేవి. కానీ బ్రతుకుబాట చూపే ఇటువంటి పద్యాలు ఆధునిక విద్యావిధానంలో కనుమరుగయ్యాయి'' అన్నారు జానకమ్మ విచారంగా.

''చాలా ఇళ్లల్లో అసంతృప్తికి, అశాంతికి కుటుంబ సభ్యుల మధ్య ఉండే ఆధిపత్య ధోరణే కారణం. కొంచెం పట్టువిడుపులు, చిన్న చిన్న రాజీలు, కొద్దిపాటి త్యాగాలతో జీవితాన్ని మరింత అందంగా గడపవచ్చు. తమ జీవన విధానంపై సంతృప్తి ఉన్నవారు, తాము సుఖపడుతూ ఇతరులకి ఆనందాన్ని కలగజేస్తారని నా నమ్మకం'' అన్నాడు కార్తీక్.

''ఆ సంగతి మీరు నిరూపించారుగా. ఇకపై మనం తీవ్రంగా ప్రయత్నించి ఆర్ట్ ఆఫ్ లివింగ్‌ను మరింత ప్రచారం చేద్దాం. మనం ఆహ్లాదపురం ఆరోవీధిని అందరికీ ఆదర్శం చేద్దాం'' అన్నారు రావుగారు.

వారివద్ద సెలవు తీసుకుని పున్నమి చంద్రుడు వెన్నెల కురిపిస్తుండగా కార్తీక్, భవ్య తృప్తిగా ఇంటి ముఖం పట్టారు.

★



## సెర్చ్‌లైటు

''ఇంటికి దీపం ఇల్లాలు అనే మాటను నమ్మను'' అన్నాడు వెంకట్.

''మరి దేన్ని నమ్ముతావురా?'' అడిగాడు రాజు.

''ఇల్లాలు అంటే సెర్చ్‌లైటు. నా భార్య నేను ఎక్కడెక్కడ తిరుగుతున్నానో ఇట్టే కనిపెట్టేస్తుంది.''

## ఉపాయం

''ఈమధ్య ఇంటికి వచ్చిన బంధువులు ఎంతకీ వెళ్లకుంటే ఏం ఏం చెయ్యాలన్నదానికి ఓ ఉపాయం కనిపెట్టా'' అన్నాడు సురేష్.

''ఏమిటది?'' అడిగాడు రాజు ఆత్రుతగా.

''మా ఆవిడతో మైసూర్‌పాక్ చేయించి వాళ్ళను తినమని బలవంతపెట్టాను. అప్పటికప్పుడే వాళ్లంతా బయలుదేరారు.''

## ఆనందం

''తెల్లవారుజామున వచ్చే కలలు నిజమవుతాయంటారు కరక్టేనా?'' అడిగాడు వెంకట్రావు.

''అవును. తప్పకుండా నిజమవుతాయి. ఏంటి సంగతి?'' అడిగాడు రంగారావు.

''ఇవ్వాళ తెల్లవారుఝామున మా ఆవిడ ఇంటి పనంతా చేస్తున్నట్టు, నేను ఆమెను కేకలు వేస్తున్నట్లు కల వచ్చింది'' ఆనందంగా చెప్పాడు.

## మంచివార్త

''ఏవండీ! ఇవ్వాళ మీకో మంచి వార్త, ఓ చెడ్డ వార్త చెబుతాను'' అంది కాంతం.

''సరే చెప్పు'' అన్నాడు భర్త ఆనందరావు.

''నేనొక కథ రాసాను'' అంది కాంతం.

ఆనందరావు ఆత్రుతగా ''సరే ఇక మంచి వార్త చెప్పు'' అన్నాడు.

**- వి.శ్యామ్‌కుమార్ (బీదర్)**

